క్లుప్తంగా

యూపీఐ ద్వారా రుసుం చెల్లింపులు



ఆర్జిత సేవల చెల్లింపులను ప్రారంభిస్తున్న శ్రీగిరి దేవస్థానం చైర్ పర్సన్

ఒంగోలు మెట్రో: శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం యూపీఐ ద్వారా ఆర్జిత సేవల రుసుం చెల్లింపు విధానానికి శ్రీకారం చుట్టినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణా రావు వెల్లడించారు. గురువారం ప్రక్రియ గురించి వివరించారు. ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభం

ఒంగోలు సబర్బన్: నగరంలోని 30వ డివిజన్‌లోని గద్దలగుంట బొమ్మల సెంటర్‌లో గురువారం ఫంక్షన్ హాలును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. స్థానిక బొమ్మల సెంటర్‌లోని మున్సిపల్ పాఠశాలలో ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఆయన ఫంక్షన్ హాలు పనులు పూర్తి కావటంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు, ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. మేయర్ సుజాతతో పాటు అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి , ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

చీమకుర్తి: రానున్న నవంబర్ లోపు అర్హత కలిగిన వారందరికీ పింఛన్లను అందిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి అన్నారు. గురువారం ఆర్.ఎల్.పురం గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌తో కలిసి మాట్లాడారు. దీపావళి నాటికి మహిళలకు దీపం పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో చేసిన పనులు గురించి చెప్పారు. తొలుత రామతీర్థంలో రూ.3.5 కోట్లుతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే విజయకుమార్‌తో కలిసి ప్రారంభించారు. మన్నం ప్రసాద్, రావిపాటి రాంబాబు, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

దర్శి: యుక్త వయస్సు విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మల్లికార్జున సూచించారు. స్థానిక ఊటుకూరి కోటయ్య హైస్కూల్లో యుక్త వయసు విద్యార్థులు నడుచుకోవాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులకు మాయమాటలు చెప్పి మోస పుచ్చే అవకాశం ఉంటుదన్నారు. అలాంటి వారి మాటలు తప్పుగా ఉన్నాయా ఒప్పుగా ఉన్నాయా గమనించుకోవాలని సూచించారు. అవమానకరంగా ప్రవర్తిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. పిల్లలు విద్య పైనే దృష్టి పెట్టి చక్కగా చదువుకోవాలని చెప్పారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు విడుదల

ఒంగోలు: ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టైలరింగ్, డ్రాయింగ్, ఎంబ్రాయిడింగ్) పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఇసుక చోరీ


పెద్దారవీడు: మండల కార్యాలయంలో జగనన్న కాలనీల కోసం నిల్వ చేసిన ఇసుక చోరీకి గురైంది. పోలీసులు, హౌసింగ్ ఏఈ శ్రావ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కార్యాలయం ఆవరణంలో హౌసింగ్ శాఖ తరపున జగనన్న కాలనీల కోసం లారీల ద్వారా ఇసుకను డంప్ చేశారు. ఇక్కడి నుంచి మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకెళ్తుంటారు. గత నెలలో ఇసుక డంపింగ్ నుంచి 10 ట్రాక్టర్ల ఇసుక గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు గుర్తించారు. అప్పుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మళ్లీ మంగళవారం రాత్రి జేసీబీ సాయంతో దాదాపు 10 ట్రాక్టర్ల ఇసుక పోయినట్లు గుర్తించారు. బుధవారం డంపింగ్ దగ్గరకు వెళ్లి ఇసుకను పరిశీలించగా జేసీబీ టైర్లు, ట్రాక్టర్ల టైర్ల జాడ కనిపించింది. దాదాపు 20 ట్రాక్టర్ ఇసుక చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశామని శ్రావ్య తెలిపారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

పేరు దాతలకు.. బిల్లు ప్రభుత్వానిదా!

- బావి నిర్మాణానికి అంచనాలు వేయాలంటూ ఒత్తిళ్లు

నాగులుప్పలపాడు: నీటి ఎద్దడి దృష్ట్యా గ్రామంలో దాతల చందాలతో చెరువు మధ్యలో నిర్మాణం చేస్తున్న బావికి అకస్మాత్తుగా అంచనాలు తయారు చేయండి.. బిల్లులు చేయించుకుంటామంటూ అధికారులపై తీవ్రమైన ఒత్తిడి రావడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మద్దిరాల ముప్పాళ్లలో రెండేళ్ల క్రితం ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా గ్రామంలోని నీటి ఎద్దడి దృష్ట్యా మద్దిరాలపాడులో గ్రామస్తులు తమ సొంత నిధులతో బావి నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ నిధులు రావు కాబట్టి ముందస్తు అధికారుల అంచనాలు, అనుమతులు, మంజూరు, కాంట్రాక్టరు అగ్రిమెంట్ వంటి నిబంధలు లేకుండా నిర్మాణం చేపట్టారు. బావి నిర్మాణం భూమిలో నుంచి 15 అడుగులు మేర పూర్తయిన తరువాత మనసు మారింది.

అంచనాలు, అనుమతులు, పనుల పర్యవేక్షణ ఉండాలని ఆర్‌డబ్ల్యూ శాఖ అధికారులకు అధికార పార్టీ నేతల నుంచి తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. దీంతో ఇటీవల గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ హడావిడిగా నిర్మాణం జరుగుతున్న బావి వద్ద కు వెళ్లి ఫొటోలు, మెటీరియల్ అంచనాలు తీసుకోవడానికి ప్రయత్నించడంతో కొందరు గ్రామస్తులు ఇదేలా సాధ్యమని ప్రశ్నించారు. దాతృత్వంతో నిర్మాణం జరుగుతున్న బావికి ప్రభుత్వ అధికారుల అంచనాలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించడంతో అసలు విషయం బయటకు పొక్కింది. దాతల సహకారంతో నిర్మాణం జరుగుతున్న బావిని చూపించి దొంగ బిల్లులు చేయించుకోవడానికి అధికారపార్టీ నేతల యత్నిస్తున్న విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ బాబును ప్రశ్నించగా.. బావి నిర్మాణానికి ఎలాంటి అంచనాలు తయారు చేయడం ఇప్పుడు సాధ్యం కాదని తెలిపారు.



మద్దిరాల చెరువులో కొత్తగా నిర్మాణం చేస్తున్న బావి

నగర పరిశుభ్రతే ధ్యేయం



కొప్పోలు రోడ్డులో మంచినీటి పైపులైన్ మరమ్మతులు పరిశీలిస్తూ...



మూత్ర విసర్జన ప్రాంతాల్లో గోడలకు పెయింట్ వేసి బోర్డులు రాసేందుకు సిద్ధం చేయిస్తూ..

- పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్ వెంకటేశ్వర రావు

ఒంగోలు సబర్బన్: నగరంలో మురుగు నీరు కాలువల ద్వారా సజావుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు ఆదేశించారు. గురువారం రైల్వే స్టేషన్ రోడ్డు, కొప్పోలు రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో చేస్తున్న పారిశుద్ధ్య పనులను గురువారం పరిశీలించారు. తొలుత ఏబీఎం కాలేజీలో వాకర్స్ అభ్యర్థన మేరకు ట్రాక్‌కు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించే పనులు చేయించారు. 9వ డివిజన్ ఎన్‌టీఆర్ కాలనీతో పాటు కొప్పోలు రోడ్డులో జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. కొప్పోలు రోడ్డులో మురుగు నీరు సక్రమంగా కాలువల్లో ప్రవహించకపోవడాన్ని అధికారులకు, సిబ్బందికి చూపించి సజావుగా నీరు పోయేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్‌టీఆర్ కాలనీలో మురుగు కాలువలు శుభ్రపరచకుండా ఉండటాన్ని గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలీనలో తాగునీటి పైపులైన్‌ల మరమ్మతులను కూడా పరిశీలించారు. రాజీవ్ గృహకల్ప వార్డు సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన వద్దు

నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేయవద్దని కమిషనర్ వెంకటేశ్వర రావు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బందితో కలిసి నగరంలోని బస్టాండ్ సెంటర్, అద్దంకి బస్టాండ్ సెంటర్, బాపూజీ మార్కెట్ సెంటర్లలో పర్యటించారు. మూత్ర విసర్జన చేస్తున్న ప్రాంతాల్లోని ప్రహరీ గోడలకు పెయింటింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేయించారు. శులభ్ కాంప్లెక్స్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సి.మనోహర రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

నగరంలోని ప్రజలు అన్నిరకాల పన్నులను సకాలంలో చెల్లించాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు సూచించారు. ఈ నెలాఖరులోపు పన్నులు చెల్లించాలన్నారు. ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలం పన్నులు చెల్లించాలన్నారు. గురువారం రూ.2.28 లక్షలు వసూలయ్యాయన్నారు. దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్లలో ఉన్న నగర పాలక సంస్థకు చెందిన షాపులకు అద్దె బకాయిలు చెల్లించని షాపులకు సీలు వేస్తామని తెలిపారు.



అద్దె బకాయిలు చెల్లించని మార్కెట్‌లోని షాపులకు సీలు వేస్తున్న మున్సిపల్ ఆర్ఐ మిరియాల శ్రీనివాసులు, ఇతర అధికారులు

విద్యార్థులకు అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకుంటున్న చిన్నారులు

ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో బెస్ట్ స్టూడెంట్ అవార్డులను అక్కినేని కళాపరిషత్ తరపున ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు చింతలపాటి లక్ష్మీనారాయణ అందించారు. గత మూడు సంవత్సరాలుగా ఉత్తమ విద్యార్థి అవార్డులు ఇస్తున్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విద్యార్థులు, పూర్తి యూనిఫాం ధరించి, మంచిగా ప్రవర్తనతో పాటు చదువులో రాణిస్తూ ఉండేవారిని ఎంపిక చేశారు. ఈ ఏడాది సీహెచ్ చతుర్వేది, రిషి కుమార్‌లను ఎంపిక చేశారు. వీరికి ప్రతి ఒక్కరికి జ్ఞాపిక, పతకం, ప్రశంసపత్రం, వెయ్యి రూపాయల నగదు బహుమతిని అందించారు. అవార్డులను విద్యార్థులకు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముప్వ రాధిక అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి అవార్డులు విద్యార్థులను ప్రోత్సహిస్తాయన్నారు. కార్యక్రమంలో అక్కినేని కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు చింతలపాటి లక్ష్మీనారాయణ, స్టాఫ్ సెక్రటరీ పీవీ నారాయణ, జాయింట్ సెక్రటరీ అరుణ శ్రీ, ఉపాధ్యాయులు జి. రామయ్య, డి. శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దిబ్బల రోడ్డులో పార్క్ ప్రారంభించాలి



దిబ్బల రోడ్డు పార్కు పరిశీలిస్తున్న సీపీఎం బృందం

ఒంగోలు టౌన్: నగరంలోని 48వ డివిజన్ దిబ్బల రోడ్డులోని పార్కును వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకుడు జి. రమేష్ డిమాండ్ చేశారు. గురువారం పలువురు నాయకులతో కలిసి పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. పార్కు పనులు ప్రారంభించి 8 నెలలు కావస్తున్నప్పటికీ ఇంకా పూర్తి కాకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. పార్కు త్వరగా పూర్తయితే దీనికి చుట్టూ పక్కల ఉన్న మూడు డివిజన్ల ప్రజలకు ఉపయోగం కలుగుతుందని చెప్పారు. ఇప్పటికీ జిమ్ పరికరాలను అమర్చలేదని, దీంతో ప్రజలు రంగరాయుడు చెరువుకు వెళ్లవలసి వస్తోందన్నారు. కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. యన్. ఇంద్ర జ్యోతి, కె. రాజేశ్వరి, ఆదిలక్ష్మి, ఏడుకొండలు, పావని సుబ్బారావు, భీష్మాచారి పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయానికి మరమ్మతులు



శిద్దా హనుమంతరావును సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

చీమకుర్తి: కృష్ణసాయి గ్రానైట్ యజమాని శిద్దా హనుమంతురావు సంతనూతలపాడు ఎంఈఓ కార్యాలయానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించినట్లు ఎంఈఓ డి.వెంకా రెడ్డి తెలిపారు. హనుమంతురావును గురువారం ఘనంగా సత్కరించారు. రూ.50 వేలతో ఎంఈఓ కార్యాలయంలో పాడైన తలుపులు, కిటికీలు, పెయింటింగ్ వంటి మరమ్మతులు చేయించినట్లు ఎంఈఓ తెలిపారు. ఆర్థికంగా ముందుకొచ్చిన హనుమంతురావును సత్కరించి అభినందించారు. స్థానిక హైస్కూళ్ల హెచ్‌ఎంలు, టీచర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్తహీనతపై అవగాహన



కిశోర బాలికలకు అవగాహన కలిగిస్తున్న సూపర్‌వైజర్ నాగమణి

కురిచేడు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఆర్.నాగమణి ఆధ్వర్యంలో గురువారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు 100 రోజుల కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ కిశోర బాలికగా ఉన్నప్పటి నుంచి పోషకాహారం, సమతుల్య ఆహారం, ఐరన్, పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాల గురించి వివరించారు. ఇటువంటి విషయాలన్నింటిపై అవగాహన కలిగినప్పుడే రాబోయే తరాల్లో రక్తహీనత లేని పిల్లలను భావితరాలకు అందించనున్నట్లు వివరించారు. చిరుదాన్యాలు, ఆకుకూరలు, పప్పుదినుసులు ఆహారంలో చేర్చుకోవాలని వివరించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ ఫాతిమా, కిశోర బాలికలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చక్కటి బోధన చేయాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కటి బోధన చేసే విధంగా కృషి చేయాలని ఎంఈవో ఇందిర పేర్కొన్నారు. గురువారం ఆమె పిసితండా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థులకు బోధన చేయాలన్నారు. రోజూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి సామర్థ్యాలు పెరిగే విధంగా చూడాలన్నారు. విద్యార్థులంతా రోజూ పాఠశాలకు వచ్చే విధంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వ నియమాలను అనుసరించి రుచికరమైన, నాణ్యంగా ఉండేలా ఉపాధ్యాయులు చూడాలని చెప్పారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

పుల్లలచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిశోర్‌బాబును మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికి, ఆర్ఐ ప్రసాద్‌ను దోర్నాల ఆర్ఐగా, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ యర్రగొండపాలేనికి, యర్రగొండపాలెం గోడౌన్ డీటీగా పనిచేస్తున్న తిరుపతిరెడ్డిని పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా జిల్లా అధికారులు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడల్లో కనపర్తి విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన క్రీడాకారులతో పీఈటీ

నాగులుప్పలపాడు: సంతనూతలపాడు నియోజకరవర్గ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు పీఈటీ సుల్తాన్ భాషా తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన అండర్ –17 విభాగంలో వాసవి 100 మీ, 200 మీ, 400 మీ లో ప్రథమ స్థానం, పి. భువనేశ్వరి 800 మీలో ప్రథమ, సాయి ప్రసన్న 1500 మీలో ద్వితీయ స్థానం, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం, షాట్ పుట్ విభాగంలో మహాలక్ష్మి, మోహన లక్ష్మి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. లాంగ్‌జంప్‌లో ఉషప్రియ ప్రథమ.. ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానం, సుబ్బారావు ట్రిపుల్ జంప్‌లో మెదటి, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, 800 మీ పరుగులో తృతీయ స్థానం పొందారు. జోష్ అనే విద్యార్థి 3 కి.మీ పరుగులో మెదటి స్థానం సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు: విద్యార్థులు సమాజంలో జరుగుతున్న మోసాలు ఇతర పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ శివరామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరు వాటి బారిన పడకుండా ఏమి చేయాలి అన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్‌కు సంబంధించిన నియమనిబంధనలు లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే తీసుకునే చర్యల గురించి వివరించారు. అదే క్రమంలో విద్యార్థినులకు గుడ్ టచ్– బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని తమ ముందు తప్పు జరుగుతుంటే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. ఈవ్ టీజింగ్ చట్ట విరుద్ధమని అటువంటి కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడుతుంటే తనకు ఫోన్ చేయాలని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి భవిష్యత్తు పొందాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళకళలాడుతున్న పొలాలు



ఏపుగా పెరిగిన కంది పంట



ఆముదం పంట..

దొనకొండ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో గ్రామాల్లోని రైతులు సాగు చేసిన కంది, ఆముదం, పత్తి, మిరప పంటలు కళకళలాడుతున్నాయి. దీంతో గ్రామాల్లోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రెండు తుఫాన్‌లు, రుతుపవన వర్షాలు కురవడంతో సాగు చేసిన పొలాలు ఏపుగా పెరిగాయి. ఇంకా 20 రోజులకు ఆముదం పంట రైతులకు అక్కరకు వస్తుంది. మండలంలో 8 వేల ఎకరాల్లో ఆముదాలు, 4 వేలు కంది, 6 వేలు పత్తి, 7 వేల ఎకరాల్లో మిరప సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఈ ఏడాది మంచి రేట్లు రావచ్చని, మెట్ట ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా అడ్డరోడ్డు



అడ్డ రోడ్డులో నిలిచిన నీరు

దొనకొండ: స్థానిక నాలుగు రోడ్ల కూడలి రోడ్డు అధ్వానంగా తయారైంది. దొనకొండ నుంచి పొదిలి, దర్శి, కురిచేడు ప్రాంతాలకు వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. వర్షం పడితే చిత్తడే. నీరు నిల్వ ఉండి వాహనాలు వెళ్లినప్పుడు పక్కనే పోయే వాహన చోదకులు, పాదాచారులపై మురుగు నీరు పడుతోంది. దీంతో చాలా మంది ప్రయాణాలు మానుకుని ఇంటికి పోవాల్సి వస్తోంది. అంతేకాకుండా చిరు వ్యాపారులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మండలంలోని అన్ని గ్రామాల నుంచి నిత్యం ప్రజలు అడ్డరోడ్డుకు అవసరం కోసం వెళ్తుంటారు. అధ్వానంగా ఉందని చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రాత్రి వేళల్లో వీధిలైట్లు లేక పోవటంతో కుక్కల బెడద ఉంటుందని, మరి ముఖ్యంగా మహిళ ఒంటరిగా ఇంటికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అడ్డ రోడ్డులో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుధాఅచ్చయ్య

దర్శి: గర్భిణీలు, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి సూచించారు. పట్టణంలోని పౌష్టికాహార మాసోత్సవాలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్ భారతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుధారాణి మాట్లాడుతూ గర్భిణి పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ పిండం దశ నుంచి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీలు అందించే బాల సంజీవని కిట్టును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు ధాన్యాలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకుంటే స్త్రీలలో అనీమియా నిర్మూలించేందుకు సాధ్యపడుతుందన్నారు. సైంటిస్ట్ మానస మాట్లాడుతూ కిశోర బాలికలకు రక్తహీనత, చిరుధాన్యాల ఆవశ్యకత గురించి వివరించారు. ఐటీసీ ప్రథమ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ అంగన్‌వాడీలో మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు అందించే పూర్వ ప్రాథమిక విద్య గురించి వివరించారు. ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి, ఏపీఓ కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.అనూరాధ పాల్గొన్నారు.